క్లుప్తంగా

సమష్టికృషితోనే అభివృద్ధి సాధ్యం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలర్లు

ఆమనగల్లు: సమష్టి కృషితోనే ప్రగతి సాధ్యమని బీసీ కమిషన్ జాతీయ సభ్యుడు ఆచారి, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, కౌన్సిలర్ సుందూరి జాన్సీరాణిలు అన్నారు. పుర పరిధి 12వ వార్డులో రూ.10 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులకు శనివారం వారు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఆమనగల్లు మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేశామని, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని మరోసారి ఆదరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ దుర్గయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు కేకేశ్రీను, మున్సిపల్ అధ్యక్షుడు విక్రంరెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మణ్, చెన్నకేశవులు, శ్రీ శైలంయాదవ్ పాల్గొన్నారు.

సన్మానం



మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డిని సన్మానిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కందుకూరు: కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి తన స్వగ్రామమైన మండల పరిధిలోని తిమ్మాపూర్‌లో తన బంధువు బీజేపీ నాయకుడు గంగాపురం నర్సింహారెడ్డి ఇటీవల మృతి చెందడంతో శనివారం ఆయన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఇటీవల కందుకూరు మండల బీజేపీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన నిమ్మ అంజిరెడ్డిని సన్మానించి అభినందించారు. పార్టీ అభివృద్ధికి కష్టపడి పని చేయాలని సూచించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, నాయకులు భిక్షపతి, ప్రభాకర్, మల్లేశ్, రఘునందన్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం



తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్ 8వ వార్డులో నిర్మించిన నూతన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగెల హేమలత, ఆ వార్డు కౌన్సిలర్ బాకీ విలాస్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శివకుమార్, ఆర్.రాజు, భావన, పద్మ, అనిత పాల్గొన్నారు.

రాజ్యాంగం అంటే పుస్తకం కాదు

బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్



సభలో మాట్లాడుతున్న నాయకులు

మీర్‌పేట: రాజ్యాంగం అంటే పుస్తకం కాదని, సమాజ హక్కులకు దశా దిశ అని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సెవెళ్ల మహేందర్ అన్నారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు చింతల రాఘవేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మీర్‌పేట జిల్లెలగూడలో నిర్వహించిన సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమానికి మహేందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 75 సంవత్సరాల భారత రాజ్యాంగం ఘన చరిత్ర, విశిష్టతను ప్రజలకు తెలియజేసేందుకు సంవిధాన్ గౌరవ అభియాన్ ద్వారా తెలియజేస్తున్నామని చెప్పారు. దేశానికి బాబా సాహెబ్ అంబేడ్కర్ ఇచ్చిన గొప్ప కానుక రాజ్యాంగం అని గుర్తుచేశారు. రాజ్యాంగాన్ని కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు పలుమార్లు ఖూనీ చేసిందని ఆరోపించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేష్, చిత్తరంజన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దిలీప్‌గౌడ్, శివప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

ఆమనగల్లు: అర్హులైన రైతులు రైతుభరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఆమనగల్లు వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. జనవరి 1, 2025 వరకు కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు.. దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్‌కార్డు, బ్యాంక్‌ఖాతా పుస్తకం, ఎన్‌రోల్‌మెంట్ ఫారం, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ కాపీలు జత చేసి, ఈ నెల 30లోపు రైతువేదికలలో ఏఈఓలకు దరఖాస్తులు అందించాలని కోరారు.

వామ్మో.. శునకాలు

మున్సిపాలిటీ వ్యాప్తంగా కుక్కల బెడద

- బయటికెళ్లాలంటే జంకుతున్న జనం
- పట్టించుకోని అధికారులు



రావిర్యాల చౌరస్తాలో స్వైరవిహారం చేస్తున్న కుక్కలు



కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి (ఫైల్)

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని ఏ వీధిలో చూసినా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులు, గుంపులుగా తిరుగుతూ దాడులకు తెగబడుతున్నాయి. ఏ వైపుగా ఏ కుక్క దాడి చేస్తుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. బయటకి వెళ్తున్న వ్యక్తులు తిరిగి క్షేమంగా ఇంటికి వచ్చేవరకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఇళ్ల నుంచి బయటికి వెళ్లాలంటేనే జంకుతున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా వాహనదారులను వెంబడిస్తూ గాయపరుస్తున్నాయి.

వీధుల్లో స్వైర విహారం

మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల, మంఖాల్, సర్దార్‌నగర్, ఇమామ్‌గూడ, తుక్కుగూడ, దేవేందర్‌నగర్ గ్రామాల్లో సుమారు వేయి కుక్కల పైగా ఉన్నట్లు సమాచారం. ఏ వీధిలో చూసినా పదుల సంఖ్యలో కుక్కలు తిరుగుతున్నాయి. రాత్రి, పగళ్లు తేడా లేకుండా గుంపులుగా స్వైరవిహారం చేస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో ప్రజలు రోడ్ల మీదికి రావడానికే భయపడుతున్నారు.

ప్రాణాలు పోయినా..

మున్సిపాలిటీలో గత మూడు నెలల నుంచి చాలా మందిపై కుక్కలు దాడి చేశాయి. ఆస్పత్రిలో వేల రూపాయలు ఖర్చు చేసి వైద్యం చేయించుకున్నారు. ఇంత మంది కుక్కల దాడికి బలవుతున్నా మున్సిపల్ అధికారులు మాత్రం వాటిని పట్టుకునే ప్రయత్నం చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. తమ ప్రాణాలు పోయినా చర్యలు తీసుకోరా అంటూ మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి

మున్సిపాలిటీ పరిధిలోని ఏ వార్డు, ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులు, గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. ప్రజల మీద గుంపులుగా దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. రాత్రి సమయంలో రోడ్డుపైకి రావడానికి ప్రజలు జంకుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– బాలు, సర్దార్‌నగర్

అందుబాటులో వ్యాక్సిన్

కుక్క కరిచిన బాధితుల సంఖ్య ఈ మధ్య చాలా పెరిగింది. తరచూ వైద్యం కోసం వస్తున్నారు. వచ్చిన వారికి చికిత్స చేస్తున్నాము. రేబిస్ నివారణకు వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. కుక్క కరిచిన చోట బాధితులు మొదట సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. అనంతరం వ్యాక్సిన్ తప్పకుండా వేయించుకోవాలి.

– స్వరూప, లేమూర్ క్లస్టర్ వైద్యురాలు

‘స్థానిక’ ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వం విఫలం



జల్‌పల్లి పాలక మండలితో ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎమ్మెల్యే సబితా రెడ్డి

పహాడీషరీఫ్: స్థానిక సంస్థలకు సకాలంలో ఎన్నికలు నిర్వహించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి విమర్శించారు. ఏడాది దాటినా ఇప్పటికీ పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికలకు అతీగతీ లేదని, తాజాగా గడువు తీరిన మున్సిపాలిటీల ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పలేని పరిస్థితి నెలకొందన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పాలక మండలి సభ్యులకు శనివారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్లా సాది, ఇతర కౌన్సిలర్లు ఐదేళ్ల కాలంలో ఎదురైన అనుభవాలను పంచుకున్నారు. ఎమ్మెల్యే సబితారెడ్డి కృషి ఫలితంగానే మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగస్వాములమయ్యామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సబితా రెడ్డి మాట్లాడుతూ.. జల్‌పల్లిలో గడిచిన ఐదేళ్లలో రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని, మరో రూ.500 కోట్ల పనులు చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం మారడంతో ఒక్కసారిగా అభివృద్ధికి మోకాలడ్డినట్లుగా మారిందన్నారు. ఐదేళ్లలో ఎన్నో క్లిష్టమైన సమస్యలు పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకట్రామ్, వైస్ చైర్మన్ ఫర్హానా నాజ్, కో–ఆప్షన్ సభ్యుడు సూరెడ్డి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు షేక్ ఫమిదా అఫ్జల్, ఎనగండ్ల ప్రశాంతి శ్రీధర్ గౌడ్, పల్లపు శంకర్, లక్ష్మీనారాయణ, పందెం పుష్పమ్మ, అహ్మద్ కసాది, జింకల రాధిక, శంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి అవగాహన



సీనియర్ సిటిజన్లను సన్మానిస్తున్న తహసీల్దార్

ఓటు హక్కు వజ్రాయుధం

తహసీల్దార్ గోపాల్

కందుకూరు: ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరుగా నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ గోపాల్ పిలుపునిచ్చారు. ఆర్డీఓ కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రం వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి ఓటు హక్కు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్లు శేఖర్, మణిపాల్‌రెడ్డి, నవత, యాదగిరి, కందుకూరు, మహేశ్వరం, సరూర్‌నగర్, బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు సన్మానం

హుడాకాంప్లెక్స్: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే వజ్రాయుధమని సరూర్‌నగర్ తహసీల్దార్ వేణుగోపాల్ అన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా సరూర్‌నగర్ మండల కార్యాలయంలో సీనియర్ సిటిజన్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జంగయ్య, జూనియర్ అసిస్టెంట్ గీత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘లక్ష డప్పుల’ను విజయవంతం చేయండి

ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబుమాదిగ



కళాజాత నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మహేశ్వరం: ఈ నెల 28న మహేశ్వరం మండలానికి వెయ్యి గొంతులు–లక్ష డప్పుల సన్నాహక సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరుకానున్నారని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబు మాదిగ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మహేశ్వరం, తుమ్మలూరు, గంగారం, సిరిగిరిపురం గ్రామాల్లో వెయ్యి గొంతులు–లక్ష డప్పుల చప్పుళ్ల కార్యక్రమం విజయవంతం చేయాలని కళా కారులతో కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఇటీవల సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా కొంతమంది మాలలు వర్గీకరణ అమలు కాకుండా అడ్డుతగులుతున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణ న్యాయమైన డిమాండ్ అన్నారు. ఎస్సీల్లో ఉన్న 59 కులాలు జానాభా ధమాషా ప్రకారం వాటాలు రావాలని మంద కృష్ణ మాదిగ గత 30 సంవత్సరాల నుంచి ఉద్యమిస్తున్నారన్నారు. కొంతమంది స్వార్థపరులు ధన, రాజకీయ బలంతో అమలు కాకుండా అడ్డుకునే కుట్రలు పన్నుతున్నారన్నారు. ఈ నెల 28 మహేశ్వరం మండల కేంద్రంలో జరిగే జిల్లా సన్నాహక కార్యక్రమానికి నియోజకవర్గంలో ఉన్న ప్రతి మాదిగ బిడ్డ హాజరై విజయవంతం కావాలని కోరారు. అంతకు ముందు పలు గ్రామాల్లో వెయ్యి గొంతులు–లక్ష డప్పుల కార్యక్రమం విజయవంతం చేయాలని కళా బృందాలతో ప్రచారం నిర్వహించారు. దళిత నాయకులు హన్మగళ్ల చంద్రయ్య, వత్తుల రఘుపతి, మహేశ్వరం మాజీ సర్పంచ్ స్వర్ణగంటి ఆనందం, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎర్ర గణేశ్ మాదిగ, సీనియర్ నాయకులు బక్కని రవి మాదిగ, స్వామి, రాంచందర్ మాదిగ, కృష్ణ, జంగయ్య, శేఖర్, అర్జున్ పాల్గొన్నారు.

మతపరమైన రిజర్వేషన్లతో తీరని అన్యాయం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

కందుకూరు: దేశంలో 70 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి పేద, బడుగు బలహీన వర్గాలను విస్మరించిందని, తామ జేబులు నింపుకొని, కులాల మధ్య చిచ్చుపెడుతూ, మతపరమైన రిజర్వేషన్లు తెచ్చి పేదలకు తీరని అన్యాయం చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి విమర్శించారు. శుక్రవారం రాత్రి బీజేపీ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని పులిమామిడి ఎస్సీ బస్తీలో రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో అంబేడ్కర్‌కు స్థానం లేకుండా చేసింది కాంగ్రెస్ పార్టీ అని, వాజ్‌పేయి హయాంలో అంబేడ్కర్‌కు గుర్తింపునిచ్చిందన్నారు. దళితుల పేరు చెప్పుకొని 70 ఏళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉందన్నారు. వారిని మోసం చేసి కనీస వసతులు కల్పించలేదన్నారు. దళితులు తమకు న్యాయం చేసే వారి వెంట నడవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు అంబటి యాదగిరి, మండల కార్యదర్శి రఘునందన్‌కుమార్, యువ మోర్చా నాయకులు సామల దయాకర్‌రెడ్డి, మామిళ్ల ప్రవీణ్, శ్రీశైలం, భాస్కర్, ఆంజనేయులు, నర్సింహా, నవీన్, బాల్‌రాజ్, పాండు, సురేశ్, రాములు, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్‌చారి, రమేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మహేశ్వరం డిపో మేనేజర్ లక్ష్మీసుధ



ఉత్తమ డ్రైవర్లను అభినందిస్తున్న డిపో మేనేజర్ లక్ష్మీసుధా

మహేశ్వరం: ఇతర వాహనాలతో పోలిస్తే ఆర్టీసీలో ప్రమాద రేటు చాలా తక్కువగా ఉందని మహేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ లక్ష్మీసుధా పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆర్టీసీ డిపోలో జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించి, ప్రమాద రహిత డ్రైవర్లు, కండక్టర్లకు ప్రగతి చక్ర అవార్డులను ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్డు భద్రత నియమాలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించగలమన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. అతివేగం అనర్థమని, మద్యం తాగి వాహనం నడపొద్దని సూచించారు. అంతకుముందు విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డిపోలో పని చేస్తున్న ఉత్తమ డ్రైవర్లు, ప్రమాద రహిత డ్రైవర్లు దేశీయా, ఎండి.కలీమ్, బీసీ రెడ్డిలకు ప్రగతి చక్ర అవార్డులను అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు, డిపో ట్రాఫిక్ మేనేజర్ అజమ్మ, డిప్యూటీ సూపరింటెండెంట్, మెకానిక్ రఘు, ఆఫీస్ సూపరింటెండెంట్ శేఖర్, ఎంప్లాయి బోర్డు సభ్యులు నర్సింహ, రాఘవేందర్ పలువురు ఆర్టీసీ కార్మికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరామర్శ



రాఘవేందర్‌రెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

బడంగ్‌పేట్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డిని శనివారం అల్మాస్‌గూడలోని ఆయన నివాసంలో రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. త్వరగా కోలుకొని ప్రజా జీవితంలో ఉత్సాహంగా పాల్గొనాలని ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చెనగారి లక్ష్మారెడ్డి, మేయర్ చిగురింత పారిజాత నర్సింహరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

మున్సిపల్ పాలకవర్గ చివరి సర్వసభ్య సమావేశం



కార్పొరేటర్లతో ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నూతన కార్యాలయ భవనంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పాలకవర్గం చివరిరోజు కావడంతో మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఐదేళ్లు కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించిన కార్పొరేటర్లకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్ లీడర్లు అర్కల భూపాల్‌రెడ్డి, కీసర గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు, కమిషనర్ జ్ఞానేశ్వర్, డీఈ వెంకన్న, మేనేజర్ చంద్రప్రకాశ్‌రెడ్డి, ఆర్ఓ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

మాడ్గుల: ఇర్విన్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు దళపతి గౌడ్ శనివారం క్రీడా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పర్వతాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలపై మంత్రికి వినతి



కందుకూరులో మంత్రికి వినతిపత్రం అందిస్తున్న గౌడ సంఘం నాయకులు

కందుకూరు: కందుకూరులో శనివారం అభివృద్ధి పనులను ప్రారంభించడానికి విచ్చేసిన రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గౌడ సంఘం మండల అధ్యక్షుడు అనేగొని పాండుగౌడ్ ఆధ్వర్యంలో నాయకులు కలిశారు. ఈ సందర్భంగా తమకు ఐదు ఎకరాల్లో ఈత చెట్లు పెంచడానికి భూమి కేటాయించాలని, మండల కేంద్రంలో గౌడ కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమితో పాటు నిధులు కేటాయించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మహేశ్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు సొడపు శేఖర్‌గౌడ్, కందూరి యుగేందర్‌గౌడ్, ఇంద్రకంటి రవీందర్‌గౌడ్, ఆయిల్ల సురేశ్‌గౌడ్, సొడపు వెంకటేశ్‌గౌడ్, భిక్షపతిగౌడ్ పాల్గొన్నారు.

డిపోకు అదనపు బస్సులు నడిపించాలి

మహేశ్వరం: మహేశ్వరం ఆర్టీసీ డిపోకు ఎలక్ట్రికల్ బస్సులతో పాటు అదనపు సర్వీసులను నడిపించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల మాజీ అధ్యక్షుడు నేనావత్ రాజునాయక్, కూన యాదయ్య కోరారు. శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి విచ్చేసిన మంత్రికి మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌తో కలిసి సమస్యను విన్నవించారు. మహేశ్వరం ఆర్టీసీ డిపోకు ఎలక్ట్రికల్ బస్సులతో పాటు పలు అదనపు సర్వీసులను నడిపించాలన్నారు. జేబీఎస్, ఉప్పల్, సికింద్రాబాద్, ఎంజీబీఎస్ డిపోల నుంచి తుక్కుగూడ వరకు వస్తున్న బస్సులను మహేశ్వరం డిపో వరకు నడిపించాలన్నారు. మహేశ్వరం మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. మహేశ్వరం–స్టేషన్ తిమ్మాపూర్(బెంగుళూరు హైవే) వయా మన్సాన్‌పల్లి, అమీర్‌పేట్ రోడ్డును నాలుగు వరుసలు చేయాలని మంత్రిని కోరారు. ఈ విషయాలను పరిశీలించి అధికారులతో మాట్లాడి బస్సులను నడిపిస్తామని మంత్రి నేతలకు హామీనిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వత్తుల రఘుపతి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు యాచారం జంగయ్య, నాయకులు లక్ష్మీనారాయణగౌడ్, భానుచందర్, ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు నడికూడ శివ, ఏపూరి నర్సింహ పలువురు పాల్గొన్నారు.

శానిటేషన్ సిబ్బందికి చీరల పంపిణీ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శానిటేషన్ మహిళా సిబ్బందికి శనివారం చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శానిటేషన్ సిబ్బంది చేసిన కృషి ఫలితంగానే జాతీయ స్థాయి స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు మున్సిపాలిటీకి దక్కిందని పేర్కొన్నారు. పదవీ కాలం ముగుస్తున్న నేపథ్యంలో 80 మందికి చీరలు పంపిణీ చేశానని చెప్పారు. పాత వారితో సమానంగా కొత్త సిబ్బందికి వేతనాలు పెంచాలని సీడీఎంఏ, కలెక్టర్‌ను ఈ సందర్భంగా ఆమె కోరారు. కమిషనర్ రవీంద్రసాగర్, కంట్రాక్టర్లు రాఘవేందర్, శ్రీనివాస్‌రెడ్డిలు ఉన్నారు.